నమస్తే తెలంగాణ

సిద్దిపేట

I | హైదరాబాద్, మంగళవారం 5 నవంబర్ 2024 | SIDDIPET

మెదక్ జిల్లా కొర్విపల్లిలో ధాన్యం కొనుగోలు చేయాలని రాస్తారోకో చేస్తున్న అన్నదాతలు

రోడ్డెక్కిన అన్నదాతలు

ధాన్యం కొనుగోలు చేయాలని మెదక్ జిల్లా కొర్విపల్లిలో రైతుల రాస్తారోకో

చిన్నశంకరంపేట, నవంబర్ 4: మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ స్వగ్రామమైన కొర్విపల్లిలో అన్నదాతలు రోడ్డెక్కారు. ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండల కొర్విపల్లిలో మెదక్ చేగుంట ప్రధాన రహదారిపై ధాన్యాన్ని పోసి రాస్తారోకో నిర్వహించారు. దీంతో రోడ్డుకు ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి 20 రోజులు దాటినా ప్రభుత్వం ధాన్యాన్ని ఎందుకు కొనుగోలు చేయడం లేదని రైతులు ప్రశ్నించారు. అకాల వర్షంతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం మొలకలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయకపోవడం వల్ల దళారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే కొనుగోళ్లు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న చిన్నశంకరంపేట ఎస్సై నారాయణ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని ఆందోళనకారులను సముదాయించి రాస్తారోకోను విరమింపజేశారు.

సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం సిద్దన్నపేట మార్కెట్ యార్డు ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల ధర్నా

నంగునూరు, నవంబర్ 4:ఆరుగాలం కష్టపడి పండించిన పంటను మార్కెట్‌లోఅమ్ముదామంటే కొనడం లేదని నిరసన వ్యక్తం చేస్తూ సోమవారం సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం సిద్ధన్నపేట మార్కెట్ యార్డు ఎదుట రైతులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 15 రోజులుగా ధాన్యం ఆరబెట్టి మార్కెట్‌కి తీసుకొచ్చి నప్పటికీ కొనడం లేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో సాఫీగా కొనుగోళ్లు జరిగేవని.. ఇప్పుడు ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ వెంటనే ధాన్యం కొనుగోలు చేసి మద్దతు ధర చెల్లించాలని రైతులు డిమాండ్ చేశారు. ధర్నాలో మండలంలోని వివిధ గ్రామాల రైతులు భారీఎత్తున పాల్గొన్నారు.

పిడిచేడ్ సమీపంలోని సీసీఐ కొనుగోలు కేంద్రంలో పత్తిని పరిశీస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి

కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర చెల్లించాలి

ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి

గజ్వేల్, నవంబర్ 4: కొనుగోలు కేంద్రాల్లో రైతులకు మద్దతు ధర చెల్లించాలని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి కోరారు. సోమవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలంలోని పిడిచేడ్ సమీపంలో సీసీఐ, జాలిగామలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆలస్యంగా సీసీఐ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడంతో రైతులు ఇప్పటికే తీవ్రంగా నష్టపోయారన్నారు. రైతులకు అన్ని సదుపాయాలు కల్పించి త్వరగా కొనుగోలు చేపట్టాలన్నారు. ఇప్పటికైనా సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో కేంద్రం నిర్ణయించిన మద్దతు ధర చెల్లించి రైతులకు న్యాయం చేయాలని అధికారులకు సూచించారు. తేమశాతం పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా పత్తి కొనుగోలు చేసే విధంగా అధికారులు చూడాలన్నారు. గ్రామాల్లో దళారులు కొనుగోలు చేపట్టకుండా మార్కెటింగ్ అధికారులు తనిఖీలు చేపడుతూ రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ధాన్యాన్ని కూడా త్వరగా కొనుగోలు చేపట్టేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, ఏఎంసీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, కార్యదర్శి జాన్‌వెస్లీ, వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్ పాల్గొన్నారు.

మెదక్ జిల్లా మల్కాపూర్‌లో మహిళా రైతుతో మాట్లాడుతున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

రైతులను ఆదుకోవాలి

ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

తూప్రాన్, నవంబర్ 4: గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మెదక్ జిల్లా తూప్రాన్ మండలంలోని మల్కాపూర్‌లో ఆయన పర్యటించారు. ఇటీవల మరణించిన వడ్డె రాజు కుటుంబాన్ని, ప్రమాదవశాత్తు నిప్పు అంటుకొని దగ్ధమైన ఎర్ర భూదమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం రైతులు ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలించి వారితో మాట్లాడారు. ఇప్పటివరకు గ్రామాల్లో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు బస్వన్నగారి సత్యనారాయణ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి పంజాల ఆంజనేయులు గౌడ్, మాజీ ఎంపీటీసీ సంతోష్ రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ గోపి నాయక్, జిన్న రాజు, చంద్రం, స్వామి, బాబు, సత్యం, పరమేశ్వర్, కృష్ణ, యాదగిరి, సాయిలు, జముల నాయక్, శ్రీనివాస్, గణేశ్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కార వేదిక ప్రజావాణి

మెదక్ అదనపు కలెక్టర్ నగేశ్

మెదక్, నవంబర్ 4 (నమస్తే తెలంగాణ): సమస్యల పరిష్కారానికే ప్రజావాణి కార్యక్రమాన్ని చేపడుతున్నామని మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేశ్ తెలిపారు. సోమవారం మెదక్ కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఆయన వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...గ్రీవెన్స్ దరఖాస్తులకు అధికారులు అధిక ప్రాధాన్యత ఇస్తూ పరిష్కారం చూపాలన్నారు. ప్రతి వారం వచ్చే దరఖాస్తులను ప్రాధాన్యత క్రమంలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. ప్రజావాణి కార్యక్రమానికి 59 దరఖాస్తులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఆర్డీవో పీడీ శ్రీనివాసరావు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

వివిధ శాఖల అధికారులతో మాట్లాడుతున్న మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

అడ్డగోలు హామీలతో మోసం చేస్తున్న ప్రభుత్వం

- అర్హులైన ప్రతి రైతుకూ పంట రుణమాఫీ చేయాలి
- ధాన్యం కొనుగోలు చేయకపోవడం బాధాకరం
- మాజీ సర్పంచ్‌లకు బిల్లులు చెల్లించాలి
- ప్రభుత్వంపై మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఫైర్

కౌడిపల్లి, నవంబర్ 4: అడ్డగోలు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తున్నదని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఆరోపించారు. సోమవారం మెదక్ జిల్లా కౌడిపల్లి మండలంలోని మహమ్మద్‌నగర్ శివారులో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన భవనాన్ని ప్రారంభించిన అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. ధాన్యం కొనుగోళ్లు చేయకపోవడం బాధాకరమన్నారు. అధికారంలో వచ్చేందుకు ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి ఇప్పుడు సన్నధాన్యానికే ఇస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. రైతులకు రూ.2లక్షల పంట రుణమాఫీ చేస్తామని చెప్పి 40శాతం మంది రైతులకు ఇవ్వలేదని మండిపడ్డారు. మాజీ సర్పంచ్‌లు చేసిన పనులకు బిల్లులు చెల్లించకపోగా, ఒక్కొక్కరికీ రూ.15 నుంచి రూ.20 లక్షల బకాయి ఉన్నాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం బిల్లులు రిలీజ్ చేసి వారిని ఆదుకోవాలన్నారు.కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

చదువుతోనే సమాజంలో మార్పు

- గ్రంథాలయాలను సరస్వతీమాతగా గౌరవించాలి
- వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ
- మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్‌గా సుహాసినిరెడ్డి ప్రమాణ స్వీకారం

మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న సుహాసినిరెడ్డి

మెదక్ మున్సిపాలిటీ, నవంబర్ 4: గ్రంథాలయాలను సరస్వతీ మాతగా గౌరవించాలని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. సోమవారం మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్‌గా సుహాసినిరెడ్డి ప్రమాణ స్వీకారోత్సవానికి మంత్రితోపాటు రాష్ట్ర గ్రంథాలయ సంస్థ వైర్మన్ రియాజ్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సుహాసినిరెడ్డితో రియాజ్ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ విద్యావంతులు కావడానికి..

మాట్లాడుతున్న మంత్రి దామోదర రాజనర్సింహ

విద్యావంతమైన సమాజానికి ప్రధాన పాత్ర పోషించేది గ్రంథాలయాలేనన్నారు. పుస్తకంతోనే సమాజ మార్పు సంతరించుకుంటుందన్నారు. ప్రతిఒక్కరి జీవితంలో ముందుకు నడిపేది పుస్తకం మాత్రమేనని గుర్తుంచుకోవాలన్నారు.ప్రతిఒక్కరూ గ్రంథాలయాలకు వెళ్లి పుస్తకాలు చదివి విద్యావంతులు కావాలని ఆకాక్షించారు. పిల్లలు విద్యావంతులు కావడం ఎంత ముఖ్యమో సంస్కారవంతులు కావడం సైతం అంతే ముఖ్యమన్నారు. సమాజంలో ప్రతిఒక్కరూ సరస్వతీ పుత్రులు కావాలన్నదే నా తపన అన్నారు. గ్రంథాలయాల్లో అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉంచుతామన్నారు. జిల్లా గ్రంథాలయానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. అంతకుముందు రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్, ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ తదితరులు మాట్లాడారు. గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టిన సుహాసినిరెడ్డిని మంత్రితో పాటు పలువురు సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేశ్, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ కార్యదర్శి వంశీకృష్ణ, డీసీసీ ప్రెసిడెంట్ ఆంజనేయులు, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, కాంగ్రెస్ నాయకులు రాజిరెడ్డి, సుప్రబాత్‌రావు పాల్గొన్నారు.

సహకార భవనం ప్రారంభం

కౌడిపల్లి, నవంబర్ 4: మెదక్ జిల్లా కౌడిపల్లి మండలంలోని మహమ్మద్‌నగర్ శివారులో నూతనంగా నిర్మించిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన కార్యాలయ భవనాన్ని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, మెదక్ ఎంపీ రఘునందన్‌రావుతో కలిసి వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి, కలెక్టర్ రాహుల్‌రాజ్, పీఏసీఎస్ చైర్మన్ బాన్సువాడ గోవర్ధన్‌రెడ్డి, వైస్ చైర్మన్ చిలుముల చిన్నంరెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రగౌడ్, మాజీ సర్పంచ్ మహిపాల్‌రెడ్డి, డైరెక్టర్లు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

త్వరలో ఐసీయూ, ఎన్‌డీసీ, ట్రామా కేంద్రాలు

- ప్రజా వైద్యంపై నూతనపాలసీ అమలు చేస్తాం
- వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహ
- మెదక్ జిల్లా నర్సాపూర్ ఏరియా ప్రభుత్వ దవాఖానలో డయాలసిస్ సెంటర్ ప్రారంభం

నర్సాపూర్, నవంబర్ 4: త్వరలోనే నర్సాపూర్ ఏరియా ప్రభుత్వ దవాఖానలో ఐసీయూ, ఎన్‌డీసీ, ట్రామా కేంద్రాలు ఏర్పాటు చేస్తామని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హామీ ఇచ్చారు. సోమవారం మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణంలోని ప్రభుత్వ ఏరియా దవాఖానలో మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, కలెక్టర్ రాహుల్‌రాజ్‌తో కలిసి ఆయన రూ.50 లక్షలతో ఐదు పడకల సామర్థ్యంతో కూడిన డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజావైద్యంపై నూతన పాలసీని అమలు చేస్తామన్నారు. నూతన డయాలసిస్ సెంటర్‌తో 22 మంది రోగులకు లబ్ధి చేకూరనుందని వెల్లడించారు. నర్సాపూర్ ఏరియా దవాఖాన పరిధిలో నాలుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఒక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు మధ్య 2లక్షల జనాభా ఉన్నదని గుర్తు చేశారు. మెదక్ జిల్లా దవాఖానలో సుమారు వంద మందికి పైగా డయాలసిస్ రోగులు చికిత్స పొందుతున్నారన్నారు. వందమందిలో 22 మంది రోగులు నర్సాపూర్ నియోజకవర్గానికి చెందిన వారిగా వివరించారు. నర్సాపూర్ నియోజకవర్గం నుంచి మొత్తం 22 మంది రోగులు ఉండగా ఇందులో నర్సాపూర్-7, కౌడిపల్లి-5, కొల్చారం-10 మంది రోగులు ఉన్నట్లు పేర్కొన్నారు. వారానికి మూడుసార్లు 14మంది రోగులకు చికిత్స అందిస్తున్నట్లు వెల్లడించారు. 22 మంది డయాలసిస్ రోగులే కాకుండా సంగారెడ్డి, నీమ్స్, మల్లారెడ్డి దవాఖాన, ప్రభుత్వ సర్వజన దవాఖానల్లో చికిత్స పొందుతున్నారన్నారు. త్వరలో నర్సాపూర్ ప్రాంతంలో ఐసీయూ, ఎన్‌డీసీ, ట్రామా అత్యవసర శాఖలు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, జడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యుడు మన్సూర్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజిరెడ్డి, ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్ పావనీ, తహసీల్దార్ శ్రీనివాస్, వైద్య సిబ్బంది, కౌన్సిలర్లు, నాయకులు మల్లేశ్ గౌడ్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నర్సాపూర్ ప్రభుత్వ దవాఖానలో డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభించిన అనంతరం వైద్య సిబ్బందితో మంత్రి దామోదర రాజనర్సింహ, మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

నర్సాపూర్ ఏరియా ప్రభుత్వ దవాఖానలో పోలీసులతో వాగ్వాదానికి దిగిన నాయకులు

అనుమతి నిరాకరణ

- పోలీసులతో వాగ్వాదానికి దిగిన స్థానిక నాయకులు
- విలేకరులను సైతం అనుమతించని పోలీసులు
- బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇలాంటి ఆంక్షలు లేవని పలువురి గుసగుస

నర్సాపూర్, నవంబర్ 4: మెదక్ జిల్లా నర్సాపూర్ ఏరియా ప్రభుత్వ దవాఖానలో వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, కలెక్టర్ రాహుల్‌రాజ్‌తో కలిసి సోమవారం డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభించారు. ప్రారంభోత్సవ కవరేజికి వచ్చిన విలేకరులతోపాటు స్థానిక నాయకులను పోలీసులు సెంటర్‌లోకి రానివ్వకుండా అడ్డుకున్నారు. కొందరి నాయకులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. విలేకరులు లోపలికి వెళ్తామని పోలీసులకు విన్నవించుకున్నా వారిని కూడా అనుమతించలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రులు వచ్చినప్పుడు ఇలాంటి ఆంక్షలు ఉండేవి కావని పలువురు నాయకులు వాపోయారు.జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రగౌడ్, మంత్రి దామోదర రాజనర్సింహ బయటకి వచ్చి విలేకరులతో మాట్లాడుతున్న సమయంలో లోపలికి ఎందుకు అనుమతించలేదని ప్రశ్నించగా మంత్రి తన ఉపన్యాసం ముగించి అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ విషయంపై సీఐ జాన్‌రెడ్డిని వివరణ కోరగా దవాఖాన సూపరింటెండెంట్ ఆదేశాల మేరకే డయాలసిస్ సెంటర్‌లోకి ఎక్కువ మందిని అనుమతించలేదని వెల్లడించారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

ప్రజావాణిలో అర్జీలు స్వీకరిస్తున్న సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట కలెక్టరేట్, నవంబర్ 4: అధికారులు సమన్వయంతో పనిచేయాలని సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి అన్నారు. సోమవారం సిద్దిపేట సమీకృత కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో ప్రజావాణిలో భాగంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి ఆయన దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజావాణి అనేది గొప్ప కార్యక్రమన్నారు. అధికారులు ప్రత్యేక చొరవ చూపి అర్జీదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలన్నారు. ప్రతి ఒక్కరికీ న్యాయం చేసే విధంగా పనిచేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. భూ సంబంధిత, ఇండ్లు, ఆసరా పింఛన్లపై 46 దరఖాస్తులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో సిద్దిపేట అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, డీఆర్‌వో నాగరాజమ్మ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

అర్జీలు స్వీకరిస్తున్న సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 4: ప్రజావాణి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. సోమవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్‌హాల్‌లో నిర్వహించిన ప్రజావాణికి జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన అర్జీదారుల నుంచి ఆయన ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయా అర్జీలను సకాలంలో పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో మొత్తం 46 అర్జీలు అందాయన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పద్మజారాణి, ఏవో పరమేశ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి హెల్ప్‌లైన్ ఏర్పాటు చేస్తాం

ఉమ్మడి జిల్లా స్పెషల్ ఆఫీసర్, ఆర్‌అండ్‌బీ ప్రిన్సిపల్ సెక్రటరీ హరిచందన

నర్సాపూర్, నవంబర్ 4: ధాన్యం కొనుగోలు విషయంలో రైతులకు తలెత్తే సమస్యల పరిష్కారానికి జిల్లాస్థాయిలో హెల్ప్‌లైన్ ఏర్పాటు చేస్తామని ఉమ్మడి జిల్లా స్పెషల్ ఆఫీసర్, ఆర్‌అండ్‌బీ ప్రిన్సిపల్ సెక్రటరీ హరిచందన పేర్కొన్నారు. సోమవారం మెదక్ జిల్లా నర్సాపూర్ ఆర్డీవో కార్యాలయంలో జిల్లా అధికారులతో ధాన్యం కొనుగోలు కేంద్రాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధాన్యం తేమశాతం తక్కువగా ఉండేలా చూసుకోవాలని, ధాన్యం పూర్తిగా ఎండిన తర్వాతనే తూకానికి తీసుకువస్తే రైతులకు లాభం చేకూరుతుందని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యాన్ని చివరి గింజ వరకూ కొనుగోలు చేస్తామని, రైతులు ఆందోళన చెందవద్దన్నారు. ధాన్యం తీసుకువచ్చిన రైతులకు టోకెన్లు ఇవ్వాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ప్రతి కొనుగోలు కేంద్రానికి 25 టార్పాలిన్లు అదనంగా పెంచామని చెప్పారు. అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ధాన్యం కొనుగోలు ప్రక్రియను విజయవంతం చేయాలన్నారు. సన్నరకం ధాన్యానికి తప్పకుండా రూ.500 బోనస్ చెల్లిస్తామన్నారు. సమావేశంలో మెదక్ జాయింట్ కలెక్టర్ నాగేశ్, సంగారెడ్డి జాయింట్ కలెక్టర్ మాధురి, డీఆర్డీవో జ్యోతి, నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్, సివిల్ సప్లై, అగ్రికల్చర్ ఎంఏవోలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా స్పెషల్ ఆఫీసర్, ఆర్‌అండ్‌బీ ప్రిన్సిపల్ సెక్రటరీ హరిచందన

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

కౌడిపల్లి, నవంబర్ 4 : మెదక్ జిల్లా కౌడిపల్లి మండలంలోని నాగ్సాన్‌పల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా ప్రత్యేక అధికారి దాసరి హరిచందన, జాయింట్ కలెక్టర్ నగేశ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె కొనుగోలు కేంద్రంలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. తూకం విషయంలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని, దళారులకు నమ్మి మోసపోవద్దని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో మహిపాల్‌రెడ్డి, తహసీల్దార్ ఆంజనేయులు, ఆర్ఐ శ్రీహరి, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

'మల్లన్న'కు కార్తిక శోభ

మల్లన్న ఆలయంలో దీపోత్సవం

చేర్యాల, నవంబర్ 4: కార్తిక మాసోత్సవం సందర్భంగా సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో మూడు రోజులుగా ఆలయ వర్గాలు భక్తిశ్రద్ధలతో దీపోత్సవాన్ని నిర్వహిస్తున్నాయి. దేవాదాయ శాఖ ఆదేశాల మేరకు సోమవారం మహా మండపంలో ప్రదోశకాలంలో భక్తులు దీపాలు వెలిగించి తన్మయత్వం పొందారు. స్వామివారి సన్నిధి మహా మండపం ఆవరణలో అర్చకులు స్వామివారి ఉత్సవమూర్తులను అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఏఈవో, ఎస్సై రాజు, పర్యవేక్షకులు, ఆలయ అర్చకులు, సిబ్బంది భక్తులకు ఏర్పాట్లు చేసి సేవలందించారు.